క్లుప్తంగా

నానో యూరియాపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు పంట పొలాల్లో యూరియా వాడకాన్ని తగ్గించి, నానో యూరియా వినియోగంపై దృష్టి సారించేలా డీలర్లు కృషి చేయాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సూచించారు. ఆయన సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో మండలంలోని అన్ని గ్రామాల పురుగు మందులు, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నానో ఎరువుల వాడకంపై డీలర్లకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం యూరియా బస్తాల వినియోగం, సమస్యలు, ఇబ్బందులను రైతులకు తెలియజేసి, రాబోవు రోజుల్లో నానో యూరియా, డీఏపీల వాడకం అవసరాలను రైతులకు తెలియజెప్పాలని సూచించారు. అదేవిధంగా రైతులకు నాణ్యమైన ఎరువులను ఎంఆర్పీకే అమ్మాలని, తప్పనిసరిగా రసీద్‌లు ఇవ్వాలన్నారు, నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వీఏఏ అసీఫ్, ఎంపీఈఓ వెంకటేష్, డీలర్లు ఉన్నారు.

ఈ-కేవైసీపై అవగాహన కల్పించండి



పోలకల్‌లో ఈ-కేవైసీ నమోదుపై సూచనలు చేస్తున్న ఏపీఓ రామన్న

సి.బెళగల్: ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు ఈ-కేవైసీ నమోదుపై అవగాహన కల్పించాలని ఏపీడీ అల్లిపీర మండల ఉపాధి హామీ అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఆయన సోమవారం పోలకల్, సి.బెళగల్ గ్రామాల్లో టీఏలు, ఎఫ్ఏలు చేపట్టిన కూలీల ఈ-కేవైసీ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల వివరాలను పకడ్బందీగా ఈ-కేవైసీ నమోదు చేయాలని, ఎక్కడైనా డబుల్ జాబ్ కార్డులు, డూప్లికేట్ జాబ్ కార్డులు ఉంటే వాటిని తొలగించేందుకు ఈ-కేవైసీ ఉపయోగపడుతుందన్నారు. ఏపీఓ రామన్న, జేఈ రంగస్వామి, టీఏలు, ఎఫ్ఏలు, సీనియర్ మేటీలు ఉన్నారు.

మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఆనందరావు

కల్లూరు: ప్రతి మహిళ వైద్య పరీక్షలు చేయించుకొని వైద్య సహాయం పొంది ఆరోగ్యంగా ఉండాలని కర్నూలు జిల్లా సంచార చికిత్స కార్యక్రమం మోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు, మెడికల్ ఆఫీసర్ ఆనందరావు అన్నారు. సోమవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని తడకనపల్లె గ్రామంలో ప్రధానమంత్రి స్వస్త్ నారీ.. సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్): మహిళల ఆరోగ్యం కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు. ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరానికి హాజరైన మహిళలకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. శిబిరాల్లో మహిళలకు అధిక రక్తపోటు, డయాబెటిస్, క్యాన్సర్ వంటి వ్యాధుల స్క్రీనింగ్‌తో పాటు రక్తహీనత, క్షయ వంటి వాటికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. వైద్యాధికారులు మనోజ్‌కుమార్, ఎమ్.మంజూష, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

కర్నూలు (టౌన్): నగర ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించడమే తొలి ప్రాధాన్యత అని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి 54 అర్జీలు వచ్చాయని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు బాలత్రిపురసుందరిగా..



లొద్దిపల్లెలో ప్రత్యేక ఆకర్షణగా అమ్మవారి మండపం



మండపంలో కొలుదీరిన దుర్గామాత

దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ



టెలికాం నగర్‌లో కొలువైన దుర్గామాత




బాల త్రిపుర సుందరిగా అమ్మవారు







కె.నాగలాపురంలో సుంకులా పరమేశ్వరీ, వెండికవచ అలంకరణలో వల్లెలాంబదేవి,దేవదాయశాఖ ఏర్పాటు చేసిన విగ్రహం



గార్గేయపురం బీసీ కాలనీలో దుర్గమ్మ



నిడ్జూరులో వెలసిన దుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ



కన్యకా పరమేశ్వరి ఆలయంలో పార్వతీదేవిగా వాసవీమాత

పాణ్యం: దేవి శరన్నవరాత్రులు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శమిచ్చారు. మండల కేంద్రంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు శ్రీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని నిర్వాహకులు బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. అలాగే కన్యాకపరమేశ్వరి ఆలయంలో పార్వతిదేవిగా వాసవీమాత దర్శనమిచ్చారు.

ఓర్వకల్లు: దసరా వేడుకలను పురస్కరించుకొని దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం సందర్భంగా సోమవారం దుర్గామాత విగ్రహాలను కొలువుంచారు. మండలంలోని లొద్దిపల్లె, నన్నూరు, హుసేనాపురం గ్రామాల్లో మొత్తం 14 విగ్రహాలను కొలువుంచారు. లొద్దిపల్లెలో నన్నూరు నుంచి ఉయ్యాలవాడకు వెళ్లే ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాదాపు రూ.5 లక్షల వ్యయంతో తిరుమల శ్రీవారి ఆలయ నమూనాతో బంగారు వర్ణంలోని మండపం చూపరులను ఆకట్టుకొంటుంది.

కల్లూరు: దేవీ శరన్నవరాత్రులు ప్రారంభోత్సవ సందర్భంగా కల్లూరు అర్బన్ 20వ వార్డు టెలికాంనగర్‌లో దుర్గామాత విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాలు సోమవారం మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాల్లోని కాళికాదేవి, వల్లెలాంబదేవి, కన్యకా పరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవి అమ్మవార్లను వెండికవచ, బాల త్రిపుర సుందరి దేవి, ఆదిలక్ష్మి దేవిగా వివిధ రూపాల్లో అలంకరించి భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

వల్లెలాంబదేవి సన్నిధిలో కుడా చైర్మన్ దంపతులు దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలోని హంద్రీనది ఒడ్డున వెలసిన వల్లెలాంబదేవికి సోమవారం రాత్రి కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీ సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గూడూరు మండలంలోని కె.నాగలాపురంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ అమ్మవారిని బాలత్రిపుర సుందరి దేవిగా అలంకరించగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

సి.బెళగల్: దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఈశ్వర స్వామి ఆలయ ఆవరణలో అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అర్చకులు సుదర్శమాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని బాలాత్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంకాలం కుంకుమార్చన పూజలు, రాత్రి దేవి పారాయణం చేశారు. సి.బెళగల్‌లోని తెలుగు వీధిలో కొలువైన గంగమ్మకు కాలనీ వాసులు ప్రత్యేక అలంకరణతో పూజలు నిర్వహించారు. కోమటి వీధిలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవిని సైతం బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరించి పూజలు చేశారు. అలాగే పోలకల్, కంబదహాల్, కొత్తకోట, బురాన్‌దొడ్డి, ముడుమాల, మారందొడ్డి తదితర గ్రామాలలో అమ్మవారి ఆలయాల్లో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా దేవతా మూర్తులకు ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు చేపట్టారు.

కర్నూలు(రూరల్): మండలంలోని ఇ.తాండ్రపాడు, పంచలింగాల, గొందిపర్ల (ఇందిరమ్మ కాలనీ), సుంకేసుల, ఆర్.కొంతలపాడు, గార్గేయపురం, నందనపల్లె, భూపాల్ నగర్‌లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థానంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రాకల పూలు, పట్టు వస్త్రాలతో బాల త్రిపురసుందరిగా అలంకరింపచేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. నిడ్జూరు-మునగాలపాడు గ్రామాల పరిధిలో తుంగభద్ర నది ఒడ్డున మామిడి తోటలో దుర్గమ్మ ఆలయంలో భజనలు, భక్తి పాటలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నందనపల్లెలో ప్రతిష్ఠించిన దుర్గమ్మను బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



దుర్గామాతకు పూజలు చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి



వల్లెలాంబదేవి పల్లకీ సేవలో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్



సి.బెళగల్ ఈశ్వరాలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



నందనపల్లెలో బాలత్రిపురసుందరిగా అమ్మవారు

హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న అలివేలమ్మ

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలమ్మ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మహిళా సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీనియర్ నాయకురాలు నాగమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అలివేలమ్మ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చెల్లించాలన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా.. అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు, అవమానాలు, వివక్ష కొనసాగుతున్నప్పటికీ కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా పద్మావతి, లలితమ్మ, సహాయ కార్యదర్శులుగా తిమ్మక్క, రమాదేవి, ఉపాధ్యక్షులుగా లక్ష్మి, కమిటీ సభ్యులను ఎన్నాకున్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా!



పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

కర్నూలు(రూరల్): ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యాక్రమంపై మండలంలోని పలువురు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్థానిక రూరల్ తహసీల్దారు టీ.వీ.రమేష్‌బాబు తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులు, స్త్రీ సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. మండల విద్యాధికారి వచ్చి ఏదో పని ఉందని బయటకు వెళ్లిపోయారు.

- ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎంపీడీఓ వి.జేమ్స్ కృపావరం, ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీఓ మధుబాబు పాల్గొన్నారు. వెలుగు మెప్మా మండల అధికారి కాసేపు ఉండి వెళ్లిపోయారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో పాల్గొనేందుకు వెళ్లారు.
- ఇక విద్యుత్, పోలీస్, ఎక్సైజ్, హౌసింగ్, ఆర్అండ్‌బీ, ఫిషరీస్ తదితర శాఖల వారు ఎక్కడున్నారో ఎవరికీ తెలియడం లేదు. దీంతో వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు సంబంధిత అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

పీజీఆర్ఎస్‌కు స్పందన కరువు



సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు హాజరైన అధికారులు

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు మండల ప్రజల నుంచి స్పందన కరువైంది. సోమవారం ఆయా శాఖలకు చెందిన మండల అధికారులతో కలిసి డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి పీజీఆర్ఎస్ నిర్వహించారు. అయితే సమస్యలు తెలిపేందుకు మండల ప్రజలెవ్వరు రాకపోవడంతో అధికారులు ఖాళీగా కనిపించారు.కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పీఆర్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, వెంకట్ ప్రకాష్, ఎంఈఓ జ్యోతి, మండల పరిషత్ పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జరీనా, ఉపాధిహామీ ఏపీఓ రామన్న తదితరులు హాజరయ్యారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఆయా గ్రామాల రైతులు భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన నర్సప్ప (37) సోమవారం తన నివాసంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో భార్య బయటికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఆమె తిరిగి ఇంటికి వచ్చేసరికి ఉరికి వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందకు దించి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు వెల్డర్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఇతనికి ఇద్దరు కుమారులు సంతానం. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా అర్బన్ పోలీసులు తెలిపారు.

24న మెగా వైద్య శిబిరం

కోడుమూరు రూరల్: స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 24వ తేదీన కోడుమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మహిళల కోసం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధిత రైతులకు పరిహారం చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాగన్న

ఓర్వకల్లు: ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన బాధిత రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, పదేళ్లుగా మండలం పారిశ్రామిక హబ్‌గా మారడంతో ఏపీఐఐసీ పేరుమీద వేలాది ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను తీసుకున్నారన్నారు. భూములు కోల్పోయిన రైతులు కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా పరిహారం అందజేయడం లేదని మండిపడ్డారు. రెండో దశ భూసేకరణలో మండలంలోని మీదివేముల, ఉప్పలపాడు, ఉయ్యాలవాడ, పాలకొలను, కొమరోలు, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాలను ప్రభుత్వం సేకరించిందని, అయినా పరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. సంఘం మండల నాయకులు మధుసూదన్, కేవీపీఎస్ మండల కార్యదర్శి రామకృష్ణ, బాధిత రైతులు పాల్గొన్నారు.

ఉల్చాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): ఉల్చాల గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఉల్చాల వాసులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కర్నూలు నగరానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉండి 10 వేల జనాభా కలిగిన మేజర్ గ్రామ పంచాయతీలో సమస్యలను పరిష్కరించడంలో అధికారులు వైఫల్యం చెందారని ఆరోపించారు. గ్రామంలో 10 నుంచి 15 రోజులకోసారి నీరు వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. సమీపంలోని భవాపురం నుంచి మంచినీటి పైపులైన్ వేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. వెంటనే గ్రామానికి పైప్‌లైన్ వేసి వాటర్ స్టోరేజ్ ట్యాంకును పూర్తి చేసి వాడుకలోకి తేవాలని కోరారు. లేదంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ ఏ.సిరికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రకాష్, హరికిషన్‌రెడ్డి, రాము, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



నెరవాడ మెట్ట సర్వీస్ రోడ్డుపై ఆగిన విండ్ ఫ్యాన్ వాహనం

పే..ద్ద గాలిమర!

- సర్వీస్ రోడ్డుపై ఆగిన వాహనాలు
- గుజరాత్ నుంచి చెన్నైకి తరలింపు

పాణ్యం: నెరవాడ మెట్ట వద్దనున్న జాతీయ రహదారిలోనున్న సర్వీస్ రోడ్డులో సోమవారం మూడు గాలిమరలను తరలించే వాహనాలు ఆగి ఉండడంతో ఎంత పెద్ద గాలిమరలు అంటూ వాహనదారులు మాట్లాడుకున్నారు. దాదాపు 150 అడుగులకు పైగానే ఉన్న మూడు గాలిమరల వాహనాలు గుజరాత్ నుంచి చెన్నైకి బయలుదేరాయి. మార్గమధ్యలో నెరవాడ మెట్ట వద్ద సర్వీస్ రోడ్డులో మూడు భారీ ట్రైలర్లు, వీటికి సెక్యూరిటీగా మరో మూడు వాహనాలు, హెచ్చరిక వాహనాలన్నింటినీ అక్కడే ఆపారు. మూడు రోజుల క్రితం గుజరాజ్‌తో బయలుదేరినట్లు వాహనదారులు తెలిపారు.



150 అడుగులున్న గాలిమర రెక్క